క్లుప్తంగా

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా మోహినీ ఏకాదశి


అలంకరణలో లక్ష్మీనారాయణస్వామి


శ్రీదేవి, భూదేవి సమేత స్వామి

పామిడి: పట్టణంలోని తగ్గదేవాలయంలో ఉన్న అనంతగజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం మోహినీ ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించారు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేక అర్చనలు నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణం పఠించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ విగ్రహాలను శోభాయానంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. స్తోత్ర పారాయణలు, గోవింద నామాల భజనలు గావించారు. ఈసందర్భంగా భక్తులు దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

బైబిల్ స్కూల్ సద్వినియోగం చేసుకోండి

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జూన్ 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించే విరామ బైబిల్ స్కూల్‌ను క్రైస్తవ విశ్వాసుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ రెవరెండ్ బీవీ విశ్వమోహన్ ఆదివారం తెలిపారు. చిన్ననాటి నుంచే పిల్లల్లో దైవం పట్ల విశ్వాసాన్ని పెంపొందించి, సన్మార్గంలో పయనింపజేయడానికి విరామ బైబిల్ స్కూల్ తోడ్పడుతుందన్నారు.

విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్

పెద్దవడుగూరు: మండలంలో వేరుశనగ సాగు చేసే రైతులు విత్తన వేరుశనగ కోసం ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ మల్లీశ్వరి తెలిపారు. కే6 30 కిలోల ప్యాకెట్‌కు రైతులు సబ్సిడీ పోనూ రూ.1,710 చెల్లించాలన్నారు. కదిరి లేపాక్షి రకానికి రైతులు రూ.1,566 చెల్లించాలన్నారు.

ఘనంగా అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే


అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని హ్యాండ్స్ కార్యాలయంలో ఆదివారం అంతర్జాతీయ క్యాండిల్ లైట్ డే ఘనంగా నిర్వహించారు. హ్యాండ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఎయిడ్స్, హెచ్ఐవీ తో మరణించిన వారికి నివాళులర్పించడానికి క్యాండిల్ లైట్ డే నిర్వహిస్తామన్నారు. అనంతరం క్యాండిళ్లను వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో సందీప్‌కుమార్, కృష్ణవేణి, షంషాద్, రాధా కుమారి, లావణ్య, జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


జెల్లి సుబ్బరాజుయాదవ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు

శింగనమల: మండల కేంద్రానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ లారీ డ్రైవరు జెల్లి సుబ్బరాజు యాదవ్ 20 రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురికావడంతో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి పరామర్శించారు. అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే బెనిఫిట్స్ అందించేందుకు కృషి చేస్తామని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

భక్తవత్సలుడు వజ్రగిరి నారసింహుడు

- 22, 23న స్వామి బ్రహ్మోత్సవాలు


వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్


కొండపైకి కాలినడకన వెళ్లడానికి ఏర్పాటు చేసిన మెట్లు


ఆలయంపై సర్వ దేవతామూర్తుల విగ్రహాలు

పెద్దపప్పూరు: పురాతన దేవాలయాల్లో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన తిమ్మన చెరువు గ్రామ సమీపంలోని వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23న నిర్వహించనున్నారు. 22వ తేదీ స్వామి ఉత్సవమూర్తులను తిమ్మనచెరువు గ్రామం నుంచి కొండపైకి మేళతాళాలతో ఊరేగించుకుంటూ తీసుకెళ్లామని కమిటీ సభ్యులు తెలిపారు. 23న తెల్లవారుజామున తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకుల చేతులమీదుగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తిచేశారు. ఏటా వైశాఖ మాసంలో నిర్వహించే స్వామి కల్యాణోత్సవాన్ని వీక్షించడానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలనుంచి భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారు. తిమ్మనచెరువు, జూటూరు గ్రామస్తులు కలసి స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి తిరుణాల సందర్భంగా ఆలయ కార్యనిర్వహకుల అభీష్టం మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోకుండా పోలీసులు ముందస్తుగా బందోబస్తు చర్యలు చేపట్టనున్నారు.

ఆలయ చరిత్ర

పూర్వం శ్రీకృష్ణదేవరాయల పాలనలో జగమేజయ మహారాజు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. తిమ్మనచెరువు గ్రామ సమీపంలోని కొండపై ఆరడుగుల లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కాలానుగుణంగా వజ్రగిరి నరసింహస్వామిగా ఈ క్షేత్రం పేరుగాంచింది. సంతానం లేని దంపతులు ఈ స్వామిని దర్శించుకుని క్షేత్రంలో ఉన్న రావి, వేపచెట్టుకు ఊయల కడితే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఇక్కడికి విచ్చేసే భక్తుల్లో ఎక్కువగా నా అనే అక్షరంతోనే పేర్లు ఉంటాయి. కొన్నేళ్ల క్రితం దుండగులు మూలవిరాట్ కిందభాగంలో వజ్రాలున్నాయన్న అత్యాశతో గుణపాలతో తొలగిస్తుండగా విషసర్పాలు కనపబడడంతో తిరుగు ముఖం పట్టినట్లు పెద్దల సమాచారం.

క్షేత్రానికి ఇలా చేరుకోవాలి

వివిధ ప్రాంతాలనుంచి విచ్చేసే భక్తులు తాడిపత్రి పట్టణానికి చేరకుని అక్కడినుంచి చిన్నపొలమడ, జూటూరు మీదుగా 15 కిలోమీటర్లు ప్రయాణించాలి. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులతోపాటు ఆటోలు అందుబాటులో ఉంటాయి. అనంతపురం వైపు నుంచి వచ్చే భక్తులకు తాడిపత్రి మండలం యరగుంటపల్లినుంచి కూడా ఆటోల సదుపాయం ఉంటుంది.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు


గుత్తి మండలం గొందిపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐ


పెద్దవడుగూరు మండలం దిమ్మగుడిలో మాట్లాడుతున్న పోలీసులు

గుత్తి రూరల్: సార్వత్రిక ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకట్రామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని గొందిపల్లిలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయని, ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా సామరస్యంగా ఉండాలన్నారు. అలాకాకుండా తమ పార్టీ వారు గెలిచారని కేకలు వేస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి గొడవలకు దిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలసిమెలసి ఉండాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు.

యల్లనూరు: కౌంటింగ్ వరకూ ప్రశాంతంగా ఉండాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గిరిబాబు హెచ్చరించారు. మండలంలోని తిమ్మంపల్లి, గొడ్డుమర్రి, బుక్కాపురం, వాసాపురం తదితర గ్రామాల్లో ఆదివారం ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 4కౌంటింగ్ వరకూ ఎవరైనా గొడవలకు పాల్పడితే జైలుకు పంపుతామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే స్టేషన్‌కు వచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ నాగరాజు ఉన్నారు.

పెద్దవడుగూరు: ఎవరైనా శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే సహించబోమని యాడికి రూరల్ సీఐ రోషన్, ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని దిమ్మగుడి, చిన్నవడుగూరు, పెద్దవడుగూరు గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పోలీసుల అనుమతి లేకుండా రాజకీయ నాయకులు సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని సూచించారు. ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యులవుతారన్నారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ఆది వారం ముగిశాయి. ఉదయం వీరబ్రహ్మేంద్రస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రెండు రోజులు నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. తిరునాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆటబొమ్మలు, గాజుల అంగళ్లు, మిఠాయి అంగళ్లు కిటకిటలాడాయి.

కోర్టు సూపరింటెండెంట్‌కు సన్మానం


రామాంజనేయులను సన్మానించిన బార్ అసోసియేషన్ నాయకులు

గుంతకల్లు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సూపరింటెండెంట్ పనిచేస్తున్న రామాంజనేయులు బదిలీపై వెళ్తున్న నేపథ్యంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మంజుల హాజయ్యారు. రాయదుర్గానికి బదిలీ అయిన రామాంజనేయులు విధి నిర్వహణలో మరింత పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని బార్ అసోసియేషిన్ నాయకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్, సభ్యులు గోపాల్‌కృష్ణ, ఎంజీ భాస్కర్‌గౌడ్, కృష్ణారెడ్డి, సీ వెంకటేశ్వర్లు, నాగరాజు, వెంకటనాయుడు, సత్యనారాయణ, తిమ్మారెడ్డి, గురుప్రసాద్, డీసీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యాడికి సెంటర్‌లో పోలీసుల కవాతు


తహసీల్దార్ మోహనవల్లితో కలసి యాడికిలో కవాతు నిర్వహిస్తున్న సీఐ నాగార్జున రెడ్డి

యాడికి: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీస్ యాక్టు అమల్లో ఉన్నాయని తహసీల్దార్ మోహన వల్లి, సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. శాంతి భద్రతలు పరిరక్షించేందుకు ప్రత్యేక పోలీసు దళంతో ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, సీఐ మాట్లాడుతూ హింసాత్మక ఘర్షణలు జరుగుతున్న నేపథ్యంలో ఈసీ ఆంక్షలు విధించిందన్నారు. ప్రత్యర్థులను రెచ్చగొట్టేలా సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టడం, తప్పుడు సమాచారం ఇవ్వడం, రెచ్చగొట్టేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, గుమి గూడటం ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుత్తిలో 81.2 మి.మీ. వర్షపాతం నమోదు


ప్రింటింగ్ ప్రెస్‌లోకి చేరిన నీటిని బక్కెట్లతో ఎత్తిపోస్తున్న దృశ్యం


గాయత్రి వాటర్ ప్లాంట్ ఏరియా వద్ద పొంగి పొర్లుతున్న డ్రైనేజీ


పాత బస్టాండ్ సమీపంలోని రవూఫ్ వెల్డింగ్ షాపు వద్ద ఇలా..

గుత్తి/గుత్తి రూరల్: గుత్తిలో శనివారం సాయంత్రం, రాత్రి భారీ వర్షం కురిసింది. 81.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. లోతట్టు కాలనీలు పూర్తిగా జలమయమైయ్యాయి. గుత్తిలోని గాయత్రి వాటర్ ప్లాంట్ ఏరియా, బీసీ కాలనీ, రవూఫ్ వెల్డింగ్ షాపు ఏరియాల్లో ఇళ్లలోకి వర్షం నీరు చేరింది. డ్రైనేజీలు పొంగి పొర్లాయి. అలాగే గుత్తి ఆర్ఎస్‌లోని శుద్ధ ఫ్యాక్టరీ కాలనీ పూర్తిగా జలమయమైంది. ఇళ్లలోకి నీరు చేరింది. ఆముదాల గిరిధర్ ఇంటి సమీపంలోని వెంకటసాయి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ (ప్రింటింగ్ ప్రెస్)లోకి నీళ్లు చేరాయి. దీంతో నాలుగు మోటార్లు చెడిపోయాయి. సుమారు రూ. 50 వేలు నష్టం వాటిల్లినట్లు ప్రింటింగ్ ప్రెస్ యజమాని వెంకటేష్ వాపోయారు. అధికారులు స్పందించి పరిహారం చెల్లించాలని కోరారు. అయితే చాలా రోజుల తర్వాత భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే కొత్తపేట, బసినేపల్లి, రజాపురం, లచ్చానుపల్లి, శ్రీపురం, బసినేపల్లి తండా గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.

అభివృద్ధి బాటలు


జీ కొట్టాలకు తారురోడ్డు వేసిన దృశ్యం

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో గుంతకల్లు ఎమ్మెల్యే చొరవతో మండలంలో రూ.10 కోట్లతో తారు రోడ్లు వేశారు. గతంలో అధికవర్షాలతో పెన్నా పరవళ్లు తొక్కడంతో పెన్నా కాజ్‌వే రోడ్డు మొత్తం నీటి ఉధృతికి కోసుకుపోయింది. దీంతో రూ. 3.15 కోట్ల ఆర్అండ్‌బీ నిధులతో పామిడి-కల్లూరు ఒక కిలోమీటరు పెన్నా కాజ్‌వే పునరుద్ధరణకు నోచుకుంది. అలాగే రూ.5 కోట్ల ప్యాకేజీ నిధులతో మొత్తం 12 కిలోమీటర్ల మేర తారురోడ్డు పనులు చేశారు. జీ కొట్టాలకు రూ.1.20 కోట్లతో తారురోడ్డు సౌకర్యం కల్పించారు. అలాగే పాళ్యం-కండ్లపల్లి-నెమళ్లపల్లికి సంబంధించి తారురోడ్డు పనులు జరిగాయి. అంతేకాకుండా 2 కిలోమీటర్ల మేర పీ కొత్తపల్లి ఎస్‌డీఎఫ్ కింద రూ.1.20 కోట్లతో తారురోడ్డు వేశారు. దీంతో పామిడి మండలవాసులు హర్షం వ్యక్తం చేశారు.


పామిడి-కల్లూరు పెన్నా కాజ్‌వేపై తారురోడ్డు

26న కామాక్షి దేవి ఐదో వార్షికోత్సవం

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లిలో ఈ నెల 26న కామాక్షి దేవి 5వ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. 26న ఉదయం 8.30 గంటలకు గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, వనగ్రహ కలశ స్థాపన, నవగ్రహ పూజ, గణపతి నవగ్రహ హోమం నిర్వహిస్తామన్నారు. రాత్రి 9కి పంచ రత్నాల నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. 27న ఉదయం 7.30కి కామాక్షిదేవి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ నాగవల్లి పూజ, అర్చనలు, మహా మంగళ హారతి, నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలకు కట్టెల కోలాటం, రాత్రి 2.15కు కామాక్షిదేవి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


వృద్ధుడికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

తాడిపత్రి అర్బన్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో కర్నూలు శాంతిరాం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 150 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. వారిలో 61 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి కర్నూలులోని శాంతిరామ్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సెక్రటరీ సుబ్రమణ్యం, సభ్యులు సంజన్న, బాలసుబ్రమణ్యం, నవీన్, షాకీర్ బాషా, రఫీ, కిషోర్‌కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ బ్యాంక్ అధ్యక్షుడికి నోటీసులు


నోటీసులు అందజేస్తున్న పోలీసులు

గుత్తి: పట్టణానికి చెందిన గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్‌కు ఆదివారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. సీఐ వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు అబ్దుల్ జిలాన్ ఇంటికి వెళ్లి నోటీసులిచ్చారు. 144 సెక్షన్‌తో పాటు ఎన్నికల కోడ్ అమలులో ఉందని సభలు, సమావేశాలు జరపడానికి వీలు లేదని నోటీసులో పేర్కొన్నారు.

సువార్త సభలను జయప్రదం చేయండి

పామిడి: పట్టణంలోని క్రీస్తు కల్వరి పరిచర్య ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో సోమ, మంగళవారం నిర్వహించే రక్షణ ఉజ్జీవ సువార్త సభలను జయప్రదం చేయాలని పాస్టర్ జీ సురేంద్రబాబు ఆదివారం తెలిపారు. 20, 21 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు బైపాస్‌రోడ్డులో సభలు నిర్వహిస్తామన్నారు. ఈ సభలకు ముఖ్య ప్రసంగీకులుగా పులివెందుల పాస్టర్ ఓ రుబేను, అనంతపురం ఏఎల్ చర్చి పాస్టర్ టీఆర్ బాబు విచ్చేస్తున్నారు. ఈ సభల్లో క్రైస్తవ విశ్వాసులు పెద్దఎత్తున పాల్గొని దేవుని అనుగ్రహం పొందాలన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనే లక్ష్యం


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లుటౌన్: కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధనే లక్ష్యంగా పోరాటాలు కొనసాగిద్దామని సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పేద ప్రజల కోసం పుచ్చలపల్లి సుందరయ్య జీవితం త్యాగం చేశారన్నారు. అలాగే కార్మిక, కర్షక, పీడిత ప్రజల కోసం పుచ్చలపల్లి సుందరయ్య చేసిన ఉద్యమాలను గుర్తుచేసుకున్నారు. అంతకుముందు సీపీఎం పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి శ్రీనివాసులు, మారుతి, నాగరాజు, రంగమ్మ, తిమ్మప్ప, చంద్రశేఖర్, ఓబులేసు, అబ్దుల్లా, సూరి తదితరులు పాల్గొన్నారు.


గుంతకల్లులో 24 ఏళ్ల తరువాత కలసిన ఎస్‌కేపీ డిగ్రీ కళాశాల విద్యార్థులు


పామిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలుసుకున్న ఇంటర్ పూర్వ విద్యార్థులు

• అపూర్వ సమ్మేళనం

గుంతకల్లు: స్థానిక ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో ఆదివారం 2001-04 డిగ్రీ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 24 ఏళ్ల కిత్రం బీఏ చదివిన వీరు మళ్లీ విద్యార్థులుగా మారిపోయారు. నాటి జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను గుర్తు చేసుకొని సంతోషంగా గడిపారు. అప్పటి అధ్యాపకులతో కలసి ఆటపాటలతో సందడి చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలోనే కుటుంబసభ్యులతో అక్కడే గడిపారు. అధ్యాపకులు విజయ్‌కుమార్ (రిటైర్డ్ ప్రిన్సిపాల్). మర్రిస్వామి, హనుమంతురెడ్డి, నారాయణస్వామి, ఓబుళేసు, నాగరాజు తదితరులను శాలవాతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా వీరు ఓ కమిటీగా ఏర్పాటు చేసుకుని, చదువులో రాణించిన పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేయాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్, రమణ, రంగ, నరసింహులు, జానకిరాముడు తదితరులు పాల్గొన్నారు.

పామిడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా 2006-2008లో ఇంటర్ చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మిత్రుల కుటుంబాల బాగోగులను గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ప్రిన్సిపాల్ వేణుగోపాలు, ఉపన్యాసకులు ప్రభాకర్, ఆదినారాయణ, రామాంజనేయులు, రాజన్న, ఓబులేసును ఘనంగా సత్కరించారు.